క్లుప్తంగా

ముంపు బాధిత కుటుంబాలను ఆదుకోవాలి


టేకిశెట్టిపాలెం వద్ద బాధితులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే రాపాక

సఖినేటిపల్లి: మండలంలో వరద ముంపు బాధిత కుటుంబాలను అన్ని విధాలా ఆదుకోవాలని రాజోలు మాజీ ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు అన్నారు. ఆదివారం టేకిశెట్టిపాలెం, అప్పనరామునిలంకలలో ఆయన పర్యటించారు. వరద బాధితుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. వెంట కొల్లాబత్తుల అశోక్, కుసుమ చింటూ తదితరులు పాల్గొన్నారు.

శిక్షణ తరగతుల కమిటీ కన్వీనర్‌గా నాగరాజు


మట్టా నాగరాజు

మామిడికుదురు: ఎస్టీయూ రాష్ట్ర ఉద్యమ శిక్షణ తరగతుల కమిటీ కన్వీనర్‌గా మామిడికుదురు మండల శాఖ నుంచి మామిడికుదురుకు చెందిన ఉపాధ్యాయులు మట్టా నాగరాజును ఎంపిక చేశారని ఎస్టీయూ మండల శాఖ అధ్యక్షుడు కారుపల్లి కళ్యాణ్‌బాబు, ప్రధాన కార్యదర్శి కొమ్ముల వీరరాఘవరావు ఆదివారం తెలిపారు. రాష్ట్ర కమిటీ నుంచి ఈ మేరకు ఆదేశాలు వచ్చాయన్నారు. 23 ఏళ్ల నుంచి ఉపాధ్యాయుడిగా పని చేస్తూ 13 ఏళ్లు ఎస్టీయూ మండల శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శిగా, జిల్లా అదనపు ప్రధాన కార్యదర్శిగా, రాష్ట్ర కౌన్సిలర్‌గా పని చేశారని చెప్పారు. ప్రస్తుతం రాష్ట్ర ఉద్యమ శిక్షణ తరగుతుల కమిటీ కన్వీనర్‌గా ఎంపికయ్యారన్నారు. నాగరాజు ఎంపికపై హర్షం వ్యక్తం చేశారు. నాగరాజును అభినందించి శుభాకాంక్షలు తెలియజేశారు.

దోమలతో అప్రమత్తత అవసరం

అంబాజీపేట: ప్రస్తుత వాతావరణంలో దోమలు విపరీతంగా పెరిగిపోవడం వల్ల డెంగీ, విష జ్వరాలు సోకే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సర్పంచ్ నాగాబత్తుల శాంతకుమారి, ఈవోపీఆర్డీ బి.మమత పేర్కొన్నారు. మాచవరం పంచాయతీ పరిధిలో కార్యదర్శి జీవీవీకే కుమార్ ఆధ్వర్యంలో శనివారం రాత్రి దోమల నివారణకు ఫాగింగ్ చేయించారు. గ్రామాలను పురవీధుల్లో ఫాగింగ్ మెషీన్ ద్వారా దోమలు నియంత్రించేందుకు పొగబెట్టారు.

అనారోగ్య బాధితుడికి ఆర్థిక సాయం


సాయం అందజేస్తున్న కాశీ అన్నపూర్ణాదేవి సేవా సంస్థ సభ్యులు

రావులపాలెం: అనారోగ్యంతో బాధపడుతున్న బాధితుడికి స్థానిక కాశీఅన్నపూర్ణాదేవి సేవా సంస్థ సభ్యులు రూ.15 వేలు ఆర్థిక సాయం అందజేశారు. పశ్చిమగోదావరి జిల్లా ఆకివీడు మండలం చినకాపవరం గ్రామానికి చెందిన వెలగపల్లి అనిల్‌కుమార్ (34) రెండు కిడ్నీలు పాడైపోయాయి. కిడ్నీ మార్పిడి ఆపరేషన్ చేయించుకోవాలని వైద్యులు తెలిపారు. వైద్యం చేయించుకునే స్తోమత లేక సహాయం కోసం స్థానిక కాశీ అన్నపూర్ణ దేవి సేవా సంస్థ సభ్యులను సాయం కోరడంతో రావులపాలెంలో అనిల్‌కుమార్ భార్య స్నేహితురాలు సుమిత్రకి సంస్థ సభ్యులు చేతుల మీదుగా రూ.15 వేలు నగదు సాయంగా అందజేశారు.

మహానుభావుల పేర్లు మంచి నిర్ణయం

కొత్తపేట: ప్రభుత్వ పథకాలకు చరిత్రకారులు, మహానుభావుల పేర్లు పెట్టడం మంచి నిర్ణయమని రాష్ట్ర బీజేపీ కార్యవర్గ సభ్యుడు పాలూరి సత్యానందం అన్నారు. ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల మధ్యాహ్న భోజన పథకం (ఎండీఎం)కు అపర అన్నపూర్ణ డొక్కా సీతమ్మ పేరు, అలాగే 'విద్యా కానుక'కు 'సర్వేపల్లి రాధాకృష్ణ విద్యార్థి మిత్ర'గా, 'ఆణిముత్యాలు' కు 'అబ్దుల్ కలాం ప్రతిభా పురస్కారం'గా 'మన బడి నాడు–నేడు' కు 'మన బడి–మన భవిష్యత్' గా పేర్లు నిర్ణయించడం దేశ సేవ చేసిన వారిని గుర్తించి, గౌరవించడమని అన్నారు.

దక్షిణ మధ్య రైల్వే అధికారి పూజలు

ఆత్రేయపురం: కోనసీమ తిరుపతిగా ఖ్యాతికెక్కిన వాడపల్లి శ్రీ, భూ సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం రైల్వే చీఫ్ ఎలక్ట్రికల్ డిస్ట్రిబ్యూషన్ ఇంజినీర్ దక్షిణ మధ్య రైల్వే అధికారి కె.తారయ్యస్వామి వార్ని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయం వద్ద ఆలయ ఈఓలు భూపతిరాజు కిషోర్‌కుమార్ ఆధ్వర్యంలో ఆలయ మర్యాదలతో ఆలయ అర్చకులు ఆలయంలోకి స్వాగతం పలికారు. స్వామిని దర్శించుకుని ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.


పెదపట్నంలో వరద నీటిలో వృద్ధురాలిని తీసుకువస్తున్న చిన్నారులు


ముంపు భయంతో పెదపట్నంలో రోడ్డుపై కట్టిన పాడి గేదెలు


అప్పనపల్లిలో ప్రధాన రహదారిపై పొంగి ప్రవహిస్తున్న వరద నీరు


అప్పనరామునిలంకలో కొబ్బరి తోటల్లో వరద ఉధృతి

మళ్లీ పోటెత్తిన గోదావరి

- మెరక లంకలకు పొంచివున్న ముప్పు
- భయాందోళనలో ప్రజలు

మామిడికుదురు: గోదావరి వరద మళ్లీ లంక గ్రామాలను ముంచెత్తింది. ప్రధాన రహదారులపై వరద నీరు పొంగి ప్రవహిస్తోంది. పెదపట్నం రత్నాపురం, అరుంధతీపేట ప్రాంతాలను వరద నీరు ముంచెత్తింది. దీంతో పలు ఇళ్లు ముంపునకు గురయ్యాయి. మధ్యలంక మొత్తం ముంపునకు గురి కావడంతో పశువులను రోడ్లపై కట్టేశారు. అప్పనపల్లి ఉచ్చులవారిపేట రోడ్డు పూర్తిగా జలదిగ్బంధంలో చిక్కుకుంది. ఈ రోడ్డుపై నాలుగడుగుల మేర వరద ప్రవహిస్తోంది. దీంతో అప్పనపల్లి, బి.దొడ్డవరం, పెదపట్నంలంక గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వరద నీటిలో దిగి అష్టకష్టాలు పడుతూ రాకపోకలు సాగిస్తున్నారు. పాశర్లపూడిబాడవ, పాశర్లపూడిలంక ప్రాంతాల్లో మత్స్యకార పేటలను వరద నీరు ముంచెత్తడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వరద తాకిడికి గురైన గ్రామాల్లో రెవెన్యూ, వైద్య ఆరోగ్య, పశు సంవర్ధక శాఖ ఉద్యోగులతో పాటు సచివాలయ ఉద్యోగులు సేవలందిస్తున్నారు.

ఏడు రోజులైనా వీడని వరద

సఖినేటిపల్లి: వరద ఉధృతి ఏడు రోజులు గడుస్తున్నా కూడా ముంపు తగ్గక బాధితులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. రోజురోజుకీ వరద తగ్గినట్టే తగ్గి పెరుగుతుండడంతో టేకిశెట్టిపాలెం, అప్పనరామునిలంక, సఖినేటిపల్లిలంక, సఖినేటిపల్లి గ్రామాల్లో వరద ఉధృతి ఆదివారం యథాతథంగా కొనసాగుతుంది. గత ఆదివారం నుంచి పోటెత్తిన వరద నేటికి ఏడో రోజుకు చేరడంతో ఆయా ప్రాంతాల ప్రజలు వరద నీటిలో పడుతున్న బాధలు అన్నీ ఇన్నీ కావు. అప్పనరామునిలంకలో 13 ఏరియాల్లో వరద ఉధృతంగా ప్రవహిస్తోంది. టేకిశెట్టిపాలెం ఏటిగట్టు వద్ద నుంచి మత్స్యశాఖ ఏర్పాటు చేసిన పడవలపై గ్రామస్తులు అప్పనరామునిలంకకు రాకపోకలు సాగిస్తున్నారు. సఖినేటిపల్లి లాకుపేటలో వరద ఉధృతి కొనసాగుతోంది. సఖినేటిపల్లి లాకుల వద్ద నుంచి పడవలపై వారు లాకుపేటకు రాకపోకలు సాగిస్తున్నారు. టేకిశెట్టిపాలెం అగ్నికుల క్షత్రియ కాలనీ ఇంకా జలదిగ్బంధంలో ఉంది. మండలంలోని ఆయా వరద ముంపు గ్రామాల్లో పడవలపై టిన్ల ద్వారా తాగునీటి పంపిణీ కొనసాగుతోంది.


అప్పనరామునిలంక శివారు ఓఎన్జీసీ కాలనీలో ప్రవహిస్తున్న వరద


సఖినేటిపల్లి లాకుపేటలో గోదావరి పాయకు చేరి వరద ముంపులో దాబా


టేకిశెట్టిపాలెంలో గోదావరి పాయ వెంబడి వరద నీటిలో పడవపై ప్రయాణిస్తున్న ప్రజలు


పి.గన్నవరం మండలం కె.ఏనుగుపల్లిలో వరదనీట మునిగిన అంగన్‌వాడీ భవనం


ఊబలంక వద్ద ఉధృతంగా ప్రహిస్తున్న వరదతో ముంపు బారిన పడిన లంక పొలాలు

జలదిగ్బంధంలో బడుగువానిలంక

ఆలమూరు: మండలంలోని గోదావరి నదీతీరాన ఉన్న బడుగువానిలంకను వరద చుట్టుముట్టింది. గ్రామం నలుమూలల్లో ఉన్న పాయల్లో ఆదివారం సాయంత్రానికి వరద వచ్చి చేరి ఉద్యాన పంటలను ముంచెత్తింది. ఇప్పటికే అనేక పల్లపు ప్రాంతాల్లో వందలాది ఎకరాల పంటలు ముంపునకు గురయ్యాయి. తహసీల్దార్ డీవీఎస్ అనిల్‌కుమార్, ఎస్సై ఎల్.శ్రీను నాయక్, ఎంపీడీఓ ఎ.మేరీరోజ్ తదితరులు స్థానిక అధికారులతో కలసి గ్రామంలో పర్యటించారు. వరద బాధితులను ఆదుకునేందుకు వీలుగా ఆరు మరబోట్లను, 50 లైఫ్ జాకెట్లను సిద్ధం చేశారు. చెముడులంకలోని శ్రీకృష్ణదేవరాయ కాపు కల్యాణ మండపంలో పునరావాస శిబిరాన్ని ఏర్పాటు చేసి బియ్యం, మంచినీళ్ల ప్యాకెట్లు, నిత్యావసరాలను సమకూర్చుతున్నారు.

పెరిగిన వరద ఉధృతి

అయినవిల్లి: వరద ఉధృతి క్రమేపీ పెరుగుతోంది. లంక గ్రామాల్లోని వరదనీటి ముంపుతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. మండలంలోని వీరవల్లిపాలెం, అయినవిల్లిలంక, పొట్టిలంక, కొండుకుదురులంక, తొత్తరమూడిలోని కె.పెదలంక, చింతనలంక, మడుపల్లిలంక గ్రామాల్లో పల్లపు ప్రాంతాలు ముంపునకు గురయ్యాయి. సుమారు వారం రోజులుగా వరద పల్లపు ప్రాంతాలను ముంచెత్తడంతో వీరవల్లిపాలెం, అయినవిల్లిలంక గ్రామాలకు రాకపోకలు నిలిచాయి. లంక ప్రజలు ముక్తేశ్వరం–అయినవిల్లిలంక ఎదురుబిడెం వద్ద కాజ్‌వే మునకతో పడవలపైనే రాకపోకలు కొనసాగిస్తున్నారు. వరద ఉధృతి ఎక్కువగా ఉండటంతో పడవలపై ప్రయాణించే వారు విధిగా లైఫ్ జాకెట్లు వేసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. పాడి రైతులు వారం రోజులుగా పశుగ్రాసం లేకుండా ఇబ్బందులు పడుతున్నామని పశుగ్రాసం సరఫరా చేయాలని కోరుతున్నారు.

ఉధృతంగా వరద

రావులపాలెం: గోదావరి పరివాహక ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాల కారణంగా వచ్చి చేరుతున్న వరదతో గోదావరి ప్రవాహం ఉధృతంగా మారింది. ధవళేశ్వరం కాటన్ బ్యారేజీ నుంచి ఆదివారం అధిక మొత్తంలో నీటిని సముద్రంలోకి విడుదల చేస్తున్నారు. దీంతో మండలంలోని గౌతమి, వశిష్ట గోదావరుల్లో వరద నీటి ప్రవాహం ఎక్కువగా ఉంది. దీంతో లంక పొలాలు ముంపు బారిన చిక్కుకున్నాయి. పైన పెరుగుతున్న ప్రవాహంతో నీటి ప్రవాహం మరింత పెరిగే అవకాశం ఉందని అధికారులు చెప్పడంతో రైతులు తమ లంక పొలాలను జాగ్రత్త చేసుకుంటున్నారు. అలాగే లంక ప్రాంత వాసులు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు.


బడుగువానిలంకలో ముంపుకు గురైన బొప్పాయి తోట

అందరూ అప్రమత్తం కావాలి

కొత్తపేట: గోదావరి వరదలు ఉధృత స్థాయిలో ఉన్నందున లంక గ్రామాల ప్రజలు, రైతులు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ ఎలీషా హెచ్చరించారు. ఆదవారం ఆయన స్థానిక అధికారులతో కలసి వానపల్లి శివారు నారాయణలంకలో పర్యటించారు. ఎప్పటికప్పుడు వరద పరిస్థితిని సమీక్షిస్తూ తగు ముందస్తు చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. ముంపు ప్రభావిత ప్రాంతాల్లో అన్ని రకాల సహాయక చర్యలు తీసుకుంటున్నట్టు తహసీల్దార్ ఎలీషా తెలిపారు.

ఇబ్బందులు పడుతున్న లంక ప్రజలు

పి.గన్నవరం: భద్రాచలం వద్ద వరద తగ్గుముఖం పట్టినప్పటికీ కోనసీమలోని వశిష్ట, వైనతేయ, గౌతమీ నదీపాయల్లో వరద ఉధృతి పెరుగుతోంది. దీంతో లంక గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఊడిమూడిలంక, జి.పెదపూడిలంక, బూరుగులంక, అరిగెలవారిలంక, శివాయలంక గ్రామాల ప్రజలు పడవలపై ప్రయాణిస్తున్నారు. కె.ఏనుగుపల్లి రహదారిపై మూడు అడుగుల ఎత్తున వరదనీరు ప్రవహిస్తుండటంతో, వరదనీటిలో ప్రజలు రాకపోకలు సాగిస్తున్నారు. మానేపల్లి శివారు శివాయలంక, పల్లిపాలెం రహదారులపై వరదనీరు ప్రవహిస్తోంది. శివాయలంకకు పడవలు ఏర్పాటు చేశారు. కోనసీమ జిల్లాకు సరిహద్దులో ఉన్న పశ్చిమ జిల్లాకు చెందిన పెదమల్లంక, ఆనగర్లంక, సిర్రావారిలంక, పుచ్చల్లంక, చాకలిపాలెం శివారు కనకాయలంక గ్రామాల ప్రజలు పడవలపై ప్రయాణిస్తున్నారు. లంకలు నీట మునగడంతో పశువులకు మేత లేక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. కొత్తపేట ఆర్డీఓ జీవీవీ సత్యనారాయణ, తహసీల్దార్ షేక్ హుస్సేన్, ఎంపీడీఓ త్రిశూలపాణి వరద పరిస్థితిని సమీక్షిస్తున్నారు.

బాధితులను ఆదుకునేందుకు చర్యలు

ఎమ్మెల్యే దేవ వరప్రసాద్

సఖినేటిపల్లి: ప్రకృతి విపత్తు నుంచి బాధిత కుటుంబాలను ఆదుకునేందుకు తగిన చర్యలు తీసుకుంటున్నట్టు రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ అన్నారు. ఆదివారం టేకిశెట్టిపాలెం ఏటిగట్టు వద్ద ఈ మేరకు అమలాపురం ఆర్డీవో కేశవవర్ధన్ రెడ్డితో కలసి ఎమ్మెల్యే దేవ, డీటీ సీహెచ్ భాస్కర్, ప్రత్యేకాధికారి సిద్దార్థ వర్ధన్, ఎంపీడీవో పీవీ సత్యనారాయణలతో చర్చించారు. బాధితులకు తాగునీరు, బియ్యం, నిత్యావసరాలు పంపిణీని ఎమ్మెల్యే, ఆర్డీవో సమీక్షించారు. కాగా మండలంలో వరద ముంపులో ఉన్న వారికి భోజన వసతి గురించి ఎమ్మెల్యే ప్రత్యేకించి అధికారులతో పాటు, పార్టీ కేడర్‌కు పలు సూచనలు చేశారు. ముంపు బాధితులను ఆదుకోవడంలో మీ వంతు సహకారం అందించాలని కేడర్‌కు ఎమ్మెల్యే సూచించారు. ఏవో పీవీ నరసింహారావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శిరీష, ప్రముఖ వ్యాపారవేత్త లింగోలు పెద్దబ్బులు, గుండుబోగుల పెదకాపు, కటికిరెడ్డి మహేష్, విస్సా తాతయ్య నాయుడు, కార్యదర్శి గంగరాజు పాల్గొన్నారు.


టేకిశెట్టిపాలెం ఏటిగట్టు వద్ద అధికారులు, పార్టీ కేడర్‌తో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వరప్రసాద్

అప్పనరామునిలంకలో బియ్యం పంపిణీ

ఏటిగట్టు దిగువన అప్పనరామునిలంకలో ఆదివారం అధికారులు, ప్రజాప్రతినిధులు వరద బాధిత కుటుంబాలకు 25 కేజీల చొప్పున బియ్యం పంపిణీ చేశారు. బాధితులను ఆదుకునే క్రమంలో బియ్యాన్ని ఆయా రేషన్ షాపుల ద్వారా అందజేస్తున్నట్టు అధికారులు తెలిపారు. సర్పంచ్ ఇందుకూరి సుబ్బరాజు, మండల ప్రత్యేకాధికారి సిద్దార్థ వర్ధన్, ఎంపీడీవో పీవీ సత్యనారాయణ, డీటీ సీహెచ్ భాస్కర్, వీఆర్వో దుర్గ, కార్యదర్శి ఎ.గంగరాజు పాల్గొన్నారు.

వరద ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

ఆత్రేయపురం: గోదావరి వరద ప్రవాహం పెరుగుతున్న దృష్ట్యా వరద ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ ఎం.వెంకట్రామయ్య అన్నారు. ఆదివారం ఆత్రేయపురం మండలంలో బొబ్బర్లంక శివారు పిచ్చుకలంక, పేరవరం, వద్దిపర్రు, వాడపల్లి, వెలిచేరు, రాజవరం తదితర గ్రామాల్లో ముంపునకు గురయ్యే అవకాశం ఉన్న ప్రాంతాల్లో పర్యటించి ప్రజలను అప్రమత్తం చేశారు. ఆయా గ్రామాల్లో మెడికల్ క్యాంప్‌లను పరిశీలించి వృద్ధులు, పిల్లలు, గర్భిణులు, బాలింతల విషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఈవోపీఆర్డీ శ్రీనివాస్, ఆర్ఐ భవాని, స్థానిక సర్పంచ్‌ల ఆధ్వర్యంలో చేస్తున్న పారిశుధ్య పనులను పరిశీలించి తాగునీరు, పారిశుధ్యం విషయంలో తగు సూచనలు చేశారు. లంక ప్రాంతల్లో పశువుల కోసం వెళ్లిన రైతులు క్షేమంగా రావడానికి మోటారు బోట్లు సిద్ధంగా ఉంచినట్లు తెలిపారు. వరద ప్రాంత ప్రజలందరినీ సురక్షితంగా ఉంచేందుకు ప్రభుత్వ యంత్రాంగం అన్ని విధాలా సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. కోనసీమ తిరుపతి వాడపల్లి వేంకటేశ్వర స్వామి క్షేత్రం కేశఖండనశాల వద్ద స్నానాల రేవుకు చేరిన గోదావరి వరద ఉధృతికి భక్తుల స్నానాలకు వేరే ఏర్పాట్లు చేసి గోదావరికి వెళ్లకుండా నిలుపుదల చేసినట్లు ఆలయ ఈవో కిషోర్‌కుమార్ తెలిపారు. అలాగే రక్షణ కొరకు గజ ఈతగాళ్లను, పడవలను ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.


పిచ్చుకలంక ప్రాంతాలను పరిశీలిస్తున్న తహసీల్దార్ వెంకట్రామయ్య

ఉపాధ్యాయుడు నిత్య విద్యార్థిగా ఉండాలి

రావులపాలెం: ఉపాధ్యాయులు నిత్య విద్యార్థిగా ఉండాలని, ముఖ్యంగా సైన్స్ ఉపాధ్యాయులు శాస్త్ర, సాంకేతికతను ఎప్పటికప్పుడు అందిపుచ్చుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని జిల్లా విద్యాశాఖాధికారి (డీఈవో) ఎం.కమలకుమారి అన్నారు. స్థానిక చిర్ల కనికిరెడ్డి ఫంక్షన్ హాల్లో ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న ఫిజికల్ సైన్స్ టీచర్లకు నూతన పాఠ్య పుస్తకాలపై ఆదివారం ఒక రోజు ఓరియంటేషన్ ప్రోగ్రామ్ నిర్వహించారు. ఫిజికల్ సైన్స్ ఫోరమ్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న డీఈవో కమలకుమారి మాట్లాడుతూ సైన్స్ పరంగా విద్యార్థుల్లో ప్రశ్నించేతత్వం అలవడాలన్నారు. అప్పుడే సైన్స్‌పై ఆసక్తి, నేర్చుకోవాలనే తపన పెరుగుతుందన్నారు. మారిన సిలబస్‌కు అనుగుణంగా ఫిజికల్ సైన్స్ సబ్జెక్టులో ఉపాధ్యాయులకు వర్క్‌షాప్ నిర్వహించడంపై అభినందనలు తెలిపారు. సమావేశంలో ప్రముఖ విద్యాదాత చిర్ల కనికిరెడ్డి మాట్లాడుతూ విద్యాపరమైన కార్యక్రమాలు, విద్యాభివృద్ధికి తన వంతు సహకారం అందించనున్నట్టు తెలిపారు. డీఈవో ఎం.కమలకుమారి, విద్యాదాత కనికిరెడ్డి తదితరులను ఘనంగా సత్కరించారు.

రేపు మండల సర్వసభ్య సమావేశం

ఆలమూరు: స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో మంగళవారం మండల సర్వసభ్య సమావేశం జరగనుందని ఎంపీడీఓ ఎ.మేరీరోజ్ తెలిపారు. ఆమె ఆదివారం మాట్లాడుతూ ఎంపీపీ తోరాటి లక్ష్మణరావు అధ్యక్షతన నిర్వహించే ఈ సమావేశానికి కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరరావు ముఖ్య అతిథిగా హాజరవుతారన్నారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు తప్పనిసరిగా హాజరు కావాలన్నారు.

నడకయాతన

నానా పాట్లు పడుతున్న ప్రజలు

సఖినేటిపల్లి: మలికిపురం నుంచి ఉయ్యూరువారి మెరక, మోరి, శృంగవరప్పాడు మీదుగా కేశవదాసుపాలెం వరకూ ఉన్న ఆర్‌అండ్‌బీ రోడ్డు కురుస్తున్న వర్షాలకు ప్రజలకు తీవ్ర అసౌకర్యంగా మారింది. ఆర్‌అండ్‌బీ రోడ్డుకు ఉయ్యూరువారి మెరక, మోరి పరిధుల్లో ఆ శాఖ మరమ్మతులు చేపట్టినప్పటికీ ఉపయోగం లేకుండా పోయింది. మరమ్మతులు చేసిన చోట ఆర్టీసీ బస్సులు, భారీ లోడ్‌తో వస్తున్న వాహనాలు రాకపోకలకు పెద్ద పెద్ద గోతులు పడి, వర్షాలకు ఆ గోతులు ముంపునీటితో రోజులు తరబడి నిండి ఉండడంతో వాహనచోదకులు, పాదచారులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. ప్రధానంగా మరమ్మతులు పూర్తి చేసిన ఉయ్యూరువారి మెరక పరిధిలో సినిమా హాల్ సెంటర్ వద్ద, మోరి గాంధీ పార్క్ వద్ద రోడ్డు పెద్దపెద్ద గోతులతో అధ్వానంగా ఉంది. కాగా ఇదే మార్గంలో శృంగవరప్పాడు ఆంజనేయస్వామి ఆలయం మలుపులో వర్షాలకు రోడ్డు కొంత మేర కొట్టుకుపోయి ప్రమాదకరంగా మారింది. రాత్రి వేళల్లో ఈ గ్రామం మీదుగా ప్రయాణించే వారికి ఇక్కడ పెద్ద సమస్యగా ఉంది. దీంతో గ్రామస్తులు చొరవ చూపి ఇటుక బొంతలను తెచ్చి దెబ్బతిన్న రోడ్డు పూడ్చుకుని వారంతా రాకపోకలు సాగిస్తున్నారు. వర్షాలకు ఇటుకల బొంతల మార్గం కూడా పూర్తి చిత్తడిగా మారింది. అధికారులు ఈ ఆర్‌అండ్‌బీ రోడ్డుపై దృష్టి పెట్టాలని ఆయా ప్రాంత ప్రజలు ముక్తకంఠంతో కోరుతున్నారు.


చిరతపూడిలో అధ్వానంగా ఉన్న ప్రధాన రహదారి


మోరి గాంధీ పార్క్ వద్ద మరమ్మతులు చేసిన రోడ్డుకు పడిన గుంతలు

చిరతపూడిలో..

అంబాజీపేట: చిరతపూడిలోకి వెళ్లే ప్రధాన రహదారి శిథిలమై అధ్వానంగా తయారవడంతో అటుగా ప్రయాణించే వారు నరకయాతన అనుభవిస్తున్నారు. కొద్దిపాటి వర్షానికే రహదారిలో గుంతలు ఏర్పడి చెరువులను తలపిస్తున్నాయి. ఆదమరచి ఆ గుంతలో పడితే ప్రమాదాన్ని కొని తెచ్చుకున్నట్లే అవుతుందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పాఠశాలకు వెళ్లే చిన్నారులు, రైతులు, వృద్ధులు, బాలింతలు, గర్భిణులు ఈ రహదారిలో ప్రయాణిస్తే నానా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి రహదారిని పునర్నిర్మించి అభివృద్ధి చేయాలని కోరుతున్నారు.


శృంగవరప్పాడు ఆంజనేయస్వామి ఆలయ సమీపాన ఇటుకబొంతలతో పూడ్చిన మెయిన్ రోడ్డు

శాకంబరిగా ఉరదాలమ్మ



శాకంబరిగా ఉరదాలమ్మ, తాళ్లమ్మ అమ్మవారు

ఆలమూరు: మండలంలోని గుమ్మిలేరులో వేంచేసిన గ్రామదేవత ఉరదాలమ్మ అమ్మవారు శాకంబరీ మాతగా భక్తులకు ఆదివారం దర్శనమిచ్చారు. ఆషాఢమాసంలో అమ్మవారిని ఏటా శాకంబరిగా అలంకరించడం ఆనవాయితీగా వస్తోంది. అందులో భాగంగా ఆషాఢ చవితి బహుళ అష్టమి పర్వదినాన్ని పురస్కరించుకుని ఆలయ కమిటీ ఆధ్వర్యంలో మహిళలు అమ్మవారిని వివిధ కూరగాయలు, ఆకుకూరలతో శాకంబరి మాతగా తీర్చిదిద్దారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య ఆలయ ముఖ మండపంలో భక్తులు కుంకుమ పూజలు నిర్వహించారు. శాకంబరీ అవతారంతో ఉన్న గ్రామదేవత ఉరదాలమ్మను భక్తులు అధికసంఖ్యలో దర్శించుకుని తీర్థ ప్రసాదాలను స్వీకరించారు.

శాకంబరిగా తాళ్లమ్మ

కొత్తపేట: మండలంలోని పలివెల గ్రామ దేవత తాళ్లమ్మ తల్లి అమ్మవారు శాకంబరిగా దర్శనమిచ్చారు. ఆషాఢమాసం ఆదివారం కావడంతో ఆలయ అర్చకులు అమ్మవారిని కూరగాయలు, ఆకుకూరలు, పండ్లతో విశేషంగా అలంకరించారు. అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు. పలువురు భక్తులు కుంకుమ పూజలు నిర్వహించారు. అనంతరం ప్రసాద వితరణ జరిపారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన

రావులపాలెం: స్థానిక పరిసర ప్రాంతాలలో అనూస్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం సీజనల్ వ్యాధులపై శ్యామ్ జాదూగర్ అవగాహన కల్పించారు. చేతులను ఎలా శుభ్రం చేసుకోవాలో చిన్నారులకు శిక్షణ ఇచ్చారు. అనంతరం ఫిజియోథెరపిస్ట్ మోహిత్ సమకూర్చిన ఉచిత హోమియో మందులను పంపిణీ చేశారు.

అయినవిల్లికి పోటెత్తిన భక్తులు

అయినవిల్లి: అయినవిల్లి విఘ్నేశ్వరస్వామి ఆలయం ఆదివారం భక్తులతో పోటెత్తింది. స్వామిని అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ప్రధాన అర్చకుడు అయినవిల్లి సూర్యనారాయణమూర్తి ఆధ్వర్యంలో స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. స్వామికి మహా నివేదన అనంతరం వివిధ పుష్పాలతో సుందరంగా అలంకరించారు. స్వామివారి లఘున్యాస, ఏకాదశ రుద్రాభిషేకాల్లో 37 మంది, లక్ష్మీగణపతి హోమంలో 14 మంది దంపతులు పాల్గొన్నారు. 20 మంది తమ నూతన వాహనాలకు పూజలు చేయించుకున్నారు. ఇద్దరు చిన్నారులకు తులాభారం నిర్వహించారు. స్వామివారి అన్నదాన పథకంలో 1413 మంది అన్నప్రసాదం స్వీకరించారు. వివిధ పూజలు, అన్నదాన విరాళాలుగా స్వామి వారికి రూ.1,28,756 ఆదాయం లభించిందని ఈఓ ముదునూరి సత్యనారాయణరాజు తెలిపారు.